# సమాన స్కంధులు

"నువ్వంటే నాకెంతో ఇష్టం"

"ఎంతిష్టం?"

"ఏమో నేను చెప్పలేను. నీ మీద ఈగ పడినా సహించలేను నేను. అంతిష్టం. ఒకటి మాత్రం నిజం. నువ్వు నన్ను ప్రేమించేదానికంటే నేను నిన్నెక్కువగా ప్రేమిస్తున్నానని మాత్రం చెప్పగలను."

"అలాగా?"

"నీకు నమ్మకం లేదు కదూ, బిందూ! నీకోసం ఇవాళ్టి నుండి సిగరెట్టు తాగటం బందుచేస్తున్నాను" అంటూ సిగరెట్టుపెట్టె, లైటరుతీసి, హుసేన్‌సాగర్‌లోకి గిరాటెట్టాడు కిరణ్.

నవ్వింది బిందు. "నేను నిన్ను సిగరెట్టు తాగటం మానమనలేదే?"

"నువ్వు చెప్పాలా? తన కాబోయే భర్త సిగరెట్టు తాగటం ఏ స్త్రీకీ ఇష్టముండదు. అందుకే నీ కోసం దాన్ని త్యజించేశాను."

"ఇలా ఘోరంగా త్యాగాలు చేయటం మొదలెట్టకు. తరువాత నువ్వు నన్ను ప్రేమించినందుకు బాధపడే సమయం రావచ్చు."

"అలా ఏం రాదు."

"మంచిదే. ప్రేమ దాస్యంకారాదు. మనుష్యుల వ్యక్తిత్వాలను మింగెయ్యరాదు ప్రేమ."

"ప్రేమను గురించి నీకు గాఢంగా పరిచయం లేదు. అందుకే అలా మాట్లాడుతుంటావు. సరే, మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?"

"నీ ఇష్టం. నువ్వెప్పుడంటే అప్పుడే."

"మనది కులాంతర వివాహం కనుక మా వాళ్ళకిష్టముండదు. వాళ్ళ ఇష్టాయిష్టాలతో పనిలేదు. రిజిష్టరు మారేజి చేసుకుందాం. రేపే పెళ్ళికి అప్లయిచేద్దాం."

"అంటే మీ అమ్మానాన్నలకూ చెప్పవా?"

"చెప్పను"

"అంటే నా కోసం వాళ్ళని త్యజిస్తున్నావా?"

"నీకోసం ప్రపంచాన్నే త్యజిస్తాను."

"దాచిపెట్టి ఏదీ చేయటం నాకిష్టముండదు. వాళ్ళకు చెప్పు. మన పెళ్ళికి రావాలో వద్దో వాళ్ళే నిర్ణయించుకుంటారు."

"సరే, అలాగే చేస్తాను."

★ ★ ★

కిరణ్, బిందులు రిజిస్ట్రారు ఆఫీసులో తమ పెళ్ళికి దరఖాస్తు పెట్టుకున్నారు.

"ఫలానా వాళ్ళు పెళ్ళి చేసుకుంటున్నారని మేం నోటిపై చేస్తాం. నెలరోజుల తర్వాత మీరు ఎప్పుడైనా రావచ్చు. మంచిరోజు చూసుకురండి మీరు" అన్నాడు రిజిస్ట్రారు.

బయటికొచ్చిం తర్వాత అన్నాడు కిరణ్: "నువ్వే ముహూర్తం నిర్ణయించు."

"నాకు ఏరోజయినా ఒకటే. రోజుల్లో మంచి చెడూ ఉండవు. అది వట్టి మన నమ్మకం మాత్రమే."

"నీకు నమ్మకం లేదు కనుక నేనూ ఏ పురోహితుడినీ మంచిరోజు కోసం సంప్ర దించనులే. ఇవాల్టి నుండి ముప్ఫయి మూడోరోజు పెళ్ళి చేసుకుందాం. రెండు మూళ్ళు ఆరు. ఆరు నా లక్కీనంబర్."

"నాకభ్యంతరం లేదు. పెళ్ళికి మావాళ్ళు వస్తారు. నా స్నేహితులు ఒకరిద్దరు వస్తారు. మీ పేరెంట్స్ వస్తున్నారుగా? నీ ఫ్రెండ్సెవర్ని పిలుస్తున్నావు?"

"వాళ్ళకింకా చెప్పలేదు."

"చెప్తానన్నావుగా. నువ్వు చెప్పకపోతే నేను వెళ్ళి చెప్తాను."

"అంత అవసరం లేదులే. నేనే చెప్తాను. మా వాళ్ళొస్తే నిన్ను ఏదో ఒకటి అనక మానరు. నీ మనసుకు నొప్పి కలగవచ్చు. అందుకే సోచాయిస్తున్నాను."

"అన్నీ ముందుగా ఊహించవద్దు. కొడుకు పెళ్ళి తమకు తెలియకుండా అయితే ఏ తల్లిదండ్రికయినా బాధకలుగుతుంది. మన ఆనందంకోసం ఇంకొకళ్ళని బాధించకూడదు"

"అలాగే, అలాగే. నువ్వింక నాకు పాఠాలు చెప్పటం మానెయ్యి."

"పెళ్ళవంగానే పార్టీ ఇద్దాం. ఏ హోటల్లో అయినా ఆ ఏర్పాటు చేయాలి."

"మీ వాళ్ళకిష్టమేగా మన పెళ్ళి! వాళ్ళు ఏర్పాటు చేయరా?"

"చేస్తారు. అందరికీ మా ఇంటికి రావటానికి ఇష్టం ఉండొచ్చు. ఉండకపోవచ్చు. హోటలయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అందుకే హోటలన్నాను."

"సరే, ఆ విషయం నాకొదిలెయ్."

★ ★ ★

రిజిస్ట్రారు ఆఫీసులో సంతకాలు, దండల మార్పిడి పెళ్ళి అయింది. నూతన దంప తులు హోటల్లో పార్టీ ఇచ్చారు. భోజనాలవుతున్నాయి.

"ఇంత బలగముండి, ఎవరూ లేనట్టు జరిగింది పెళ్ళి" అంది కిరణ్ తల్లి రాజేశ్వరి, చెంగుతో కళ్ళు వత్తుకుంటూ –

"ఏమయింది కనకా? పిల్లా, పిల్లాడు ఇష్టపడ్డారు, చేసుకున్నారు. నువ్వు అనవస రంగా బాధపడకు" అన్నాడు కిరణ్ తండ్రి కేశవమూర్తి.

"ఇలా వర్ణాంతర వివాహం జరగటం కూడా మా ఇంట్లో ఇదే మొదటిది" అంది రాజేశ్వరి.

"నిజమే మాకూ కష్టమేసింది. అయినా పిల్లలు పట్టుబట్టడంతో అంగీకరించాల్సి వచ్చింది" అంది బిందు తల్లి సుమిత్ర.

"కులాలేమిటి ఈ రోజుల్లో, మనుసులు కలిసిన తర్వాత కులాల్ని పట్టించుకోవాల్సిన అవసరం లేదు" అన్నారు బిందు తండ్రి శ్రీరామమూర్తి.

"కులాలు మనం సృజించినవు కావు, కాదనుకోవటానికి" అంది రాజేశ్వరి.

"అమ్మా, నువ్వు కులాల సంగతి మాట్లాడకు" అని కసిరి., తమాయించుకుంటూ, "ఎవరి కులం వాళ్ళకే గొప్ప. కులం కాదు ప్రధానం, గుణం" అన్నాడు కిరణ్.

రాజేశ్వరి ముఖం ముడుచుకుంది.

"మా ఇంట్లోనే పార్టీ ఇద్దామన్నాం. అల్లుడే వద్దన్నాడు" అన్నాడు శ్రీరామమూర్తి.

"ఇదే బావుందిలేండి, అంకుల్! ఏ ఇంటి ప్రభావాలూ పడని ఈ హోటల్ విందే మంచిది, ఇలాంటి ప్రేమ వివాహాలకు" అన్నాడు కిరణ్ స్నేహితుడు శ్రీనివాసు.

"పెళ్ళిలాగో వాళ్ళ ఇష్టప్రకారం చేసుకున్నారు. నిజానికి పెళ్ళనేది ఓ సోషల్ ఈవెంట్. మా స్వంతమని ఎవరన్నా ఒప్పుకోవాల్సిన పనిలేదు" అన్నాడు శ్రీరామమూర్తి.

"నా అభిప్రాయమూ అదే. రేపు మేం రిసెప్షన్ ఏర్పాటు చేస్తున్నాం. దానికి మీరంతా రావాలి, బావగారూ! అక్కగారూ నా మాట మన్నించాలి" అన్నాడు కిరణ్ తండ్రి కేశవమూర్తి.

"రేపు మేం హనీమూన్‌కి వెళ్తున్నాం. కుదర్దు" అన్నాడు కిరణ్.

"ఓరోజు పోస్ట్‌పోన్ చెయ్యొచ్చుగా?" అడిగాడు కేశవమూర్తి.

"టిక్కెట్లు రిజర్వు అయిపోయ్యాయి."

"కాన్సిలుచేస్తే సరి. మరో వారం తర్వాత వెళ్ళొచ్చు" అంది బిందు.

"మళ్ళీ నెలరోజులదాకా రిజర్వేషను దొరకదు."

"ఎక్కడికెళ్తున్నారే?" అడిగింది బిందు స్నేహితురాలు ఉమ.

"ఊటీ"

"పోన్లే, ఓ వారం తర్వాత వస్తారుగా, అప్పుడే రిసెప్షన్ ఏర్పాటుచేస్తాను" అన్నాడు కేశవమూర్తి. కిరణేం జవాబివ్వలేదు.

★ ★ ★

ట్రయినులో ఊటీకి వెళ్తున్నారు కొత్త దంపతులు.

"మీ నాన్నగారు అంత ప్రేమగా రిసెప్షన్ ఇస్తానంటే నిరాకరించటమేం బాగాలేదు."

"నువ్వూ, వాళ్ళూ కలియటం నాకిష్టం లేదు. మా నాన్నేం అనకపోయినా, మా అమ్మా, చెల్లెలూ నిన్ను నొప్పించేట్టు అనవచ్చు. అందుకే రిసెప్షన్ వద్దన్నాను. మనం తిరిగొచ్చిం తర్వాత రిసెప్షనంటున్నా డాయన. ఎలా కాదనాలో తెలియటం లేదు."

"కాదనటమెందుకూ? ఏదో అంటారని భయపడటమెందుకూ? ఏదో జరుగుతుందని భయపడి పారిపోవటమెందుకూ? నీ వ్యవహారం నాకు నచ్చలేదు."

"నీకేమాత్రం కష్టం కలిగినా నా మనసు ఓర్చుకోలేదు."

"వాళ్ళ వైముఖ్యం సహజమే. అందుకు వాళ్ళని తప్పు పట్టాల్సిన పనిలేదు. వాళ్ళ మనసుల్లోని వ్యతిరేకతను తొలగించటానికి మనం వాళ్ళతో స్నేహంగా ఉండాలి. కనీసం మన ప్రయత్నం మనం చేయాలి."

"నీకు తెలీదు మా వాళ్ళ సంగతి. మీ వాళ్ళే నయం - మన పెళ్ళికి ఎలాంటి అడ్డం కులూ పెట్టలేదు."

★ ★ ★

హనీమూన్ నుండి తిరిగి వస్తున్నారు నూతన దంపతులు.

"నాన్న మన్ని రిసీవ్ చేసుకోవటానికి స్టేషను కొస్తాడు. మా ఇంటికెళ్ళక తప్పేట్టు లేదు."

"తప్పటమెందుకూ? వెళ్దాం"

"మీ ఇంటికి వెళ్దాం. అక్కడెవరూ సూటీపోటీ మాటలు అనేవాళ్ళుండరు. రెండు రోజుల్లో ఇల్లు అద్దెకు తీసుకుని మన సొంత కాపురం పెట్టుకోవచ్చు."

"వద్దు. మీ నాన్నగారికి కష్టమేస్తుంది. ఇప్పటికే వాళ్ళను బాధపెట్టాం. కొత్త బంధాలను కలుపుకుంటూ పాతబంధాలను విడనాడటం ఇంగితమనిపించుకోదు. నీవన్నీ ఊహలే. వాళ్ళు మన్ని ఎలా ట్రీట్ చేస్తారో చూడకుండానే ముందే వాళ్ళపట్ల వ్యతిరేక భావన పెంచుకోవటం మంచిది కాదు."

"ఊహలు కావు. నాకు తెలుసు. నీకు కష్టం కలిగించేవన్నీ పరిహరిస్తానని నీకు నేను ముందే చెప్పాను."

"నాకు వంటచేయటం కష్టమవుతుంది. ఆఫీసుకెళ్ళాలి కదా! నువ్వు చేస్తావా?"

"ఆ, చేస్తాను."

"పిల్లల్ని కనటం కూడా కష్టమే నాకు. నువ్వు కంటావా?"

"వీలవదు. వీలయేట్టయితే నేనే కనేవాడిని."

"పిచ్చిగా మాట్లడకు."

★ ★ ★

కేశవమూర్తి రిసెప్షన్‌కి ఎవరెవర్ని పిలవాలో లిస్టురాస్తున్నాడు.

"మన బంధువులు, స్నేహితులు, పరిచయస్థులు - అందరి పేర్లూ రాసేశాను. కోడలు తల్లీదండ్రిని పిలుద్దాం. ఆమె వైపు వాళ్ళు మరెవరు ముఖ్యులో తెలీదు పిలవ టానికి."

"తల్లీతండ్రీ చాల్లేండి, అసలు పెళ్ళిచేసి భోజనం పెట్టాల్సింది వాళ్ళు. పెళ్ళి చేయలేదు. పైస ఖర్చు లేకుండా పిల్లని పంపి ఊర్కున్నారు. నాకు తలచుకుంటేనే వంటికి కారం రాసినట్టవుతోంది. ఇంతోటి దానికి వాళ్ళవాళ్ళని కూడా పిలవాలా ఏం?"

"పినతండ్రి, పెత్తండ్రిలాంటి ముఖ్యుల్నయినా పిలవకపోతే బావుంటుందా?"

"ఎందుకు బావుంటుందీ! పిలవండి. పెళ్ళికొడుకు తల్లికి ఓ చీరయినా పెట్టి చచ్చారా వాళ్ళు!"

"అదేంమాట! మనం మాత్రం పిల్లకేం పెట్టాం? కాపురానికి పంపేప్పుడు సారె చీరలు పెట్టే పంపిస్తారులే. ఇంతలో నీ అత్తగారి తడాఖా చూపించకు. నిజానికి వాళ్ళే పార్టీ ఇచ్చే వాళ్ళేమో. నేను ముందుగా ఇస్తాననబట్టి, మనకు గౌరవమిచ్చి, వాళ్ళు మనం పార్టీ ఇచ్చిందాకా ఆగివుంటారు."

"మీరొట్టి అమాయకులు. మీకేం తెలీదు. ఊర్కోండి."

"అబ్బాయిని పిల్చి అడుగుదాం, వాడేమంటాడో."

"వాణ్ణడగాల్సిన పనిలేదు. ఇదంతా వాడినిర్వాకమేగా!"

"వాడికిష్టమైన పిల్లని పెళ్ళి చేసుకున్నాడు. మనం అభ్యంతర పెడ్తామేమోనని భయపడి చివరిదాకా మనకు చెప్పలేదు. అంతేగా?"

"ఆ దొరికింది రంభ! చేజారిపోతుందేమోనని ఆరాటపడ్డాడు."

"మెల్లిగా మాట్లాడు. గదిలో వాళ్ళకు మన మాటలు వినపడతాయేమో."

"వింటే నష్టమేం లేదు. వినాలనే అంటున్నాను."

పక్కగదిలో ఉన్న బిందుకూ, కిరణ్‌కూ ఆ మాటలు వినపడ్తూనే ఉన్నాయి. కిరణ్‌కు కోపం వచ్చింది. దూకుడుగా గది బయటకు వెళ్ళబోతూంటే బిందు అతన్ని ఆపింది.

"నువ్వేం అత్తయ్యను అనటానికి వీల్లేదు. ఆమె మనసు నేనర్థం చేసుకోగలను."

విచిత్రంగా చూశాడు కిరణ్, బిందును.

"నీది చాలా గొప్పమనసు. నీలాంటిదాన్ని పొందగలగటం నా అదృష్టం."

"అంతగా పొగడక. దురదృష్టమనుకునే రోజు రాకుండా కాపాడుకోవటానికే మనం ప్రయత్నించాలి."

★ ★ ★

"మా వదిన" అని పరిచయం చేసింది నిర్మల బిందుని తన స్నేహితురాలు అనూషకు.

"నాకూ వదినే, నీకే కాదు" అంది అనూష.

"మరీ అంత ప్రేమ ఒలకబోయకు. ఆడబిడ్డ కట్నమేం లేదు నువ్వు పంచుకోటానికి."

"కట్నాలు పోవాలనుకుంటుంటే నువ్వు ఆడబిడ్డ కట్నం రాలేదని గునుస్తావేం? వదినే కట్నం"

"అవును. అలా అనే సంబరపడి, సర్దుకుపోవాలి."

"నువ్వు మనసు కష్టపెట్టుకోకు, నిర్మలా! ఆడపడుచు కట్నం నీకెంత కావాలో చెప్పు" అంది బిందు.

"ఎందుకు, నువ్విస్తావా?"

"ఇవ్వనా మరి, నువ్వడిగితే."

"వద్దులే. అన్నయ్యకు కోపం వస్తుంది. వాడసలే మారిపోయాడు."

"ఏమిటే మారానంటున్నావు? నీకు కోపం రావటమెందుకూ?" అనడిగాడు. అప్పుడే బయట నుండి హాల్లోకి అడుగెట్టిన కిరణ్.

"నిర్మలకు ఆడబిడ్డ కట్నం రాలేదని గునుపుగా ఉంది. వదిన ఇస్తానన్నది కానీ, నీకు కోపం వస్తుందని వద్దంది" అని చెప్పింది అనూష.

"ముయ్ నోరు. కట్నాలా, గిట్నాలా! మళ్ళీ ఆమాటంటే నోటి మీద వాతపెడ్తాను."

"ఇంక ఆడబిడ్డకు అవే మిగిలాయిలే" అని రుసరుసలాడుతూ, అనూష చెయ్యి పట్టుకుని తన గదిలోకి లాక్కువెళ్ళింది నిర్మల.

"ఆ పిల్లనలా తిట్టటం నన్ను సంతోషపెట్టటానికా? నాకేం సంతోషం కలగలేదు" అని గిరిక్కున తన గదిలోకి వెళ్ళిపోయింది బిందు.

★ ★ ★

రిసెప్షన్ చివరికొచ్చింది. భోజనాలుచేసి అతిథులు ఒక్కొక్కరూ వెళ్ళసాగారు. కేశవ మూర్తి తన స్నేహితుణ్ణి దంపతులకు పరిచయం చేశాడు: "ఇతను శివరావు అనీ నా కొలీగ్ అండ్ ఫ్రెండ్"

దంపతులు ఆయనకు నమస్కరించారు.

"వాళ్ళింట్లో పై పోర్షను అద్దెకుంది. మాట్లాడాను. అద్దె రెండువేలు. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మీకు సరిపోతుంది. రేపు మీరెళ్ళి కాపురం పెట్టండి అక్కడ. విడిగా ఉంటేనే ప్రేమ బంధాలు నిలుస్తాయని నా అభిప్రాయం. మేం అదుపు పెడ్తున్నామని మీరు అనుకో నక్కర్లేదు. పెద్దలపట్ల గౌరవం లేకుండా యథేచ్ఛగా మీరు తిరుగుతున్నారని మేమనుకో నక్కర్లేదు. అందరికీ హాయి అనిపించే ఏర్పాటు ఇది" అన్నాడు కేశవమూర్తి.

"అంటే! మమ్మల్ని ఇంట్లోనుండి వెళ్ళిపొమ్మంటున్నావా, నాన్నా?"

"వెళ్ళమనటం లేదు. స్వేచ్ఛగా, సంతోషంగా ఉండమంటున్నాను" అని చెప్పి, ఆయన తన మిత్రుడితో వెళ్ళిపోయాడు, అతన్ని పంపించి రావటానికి బయటిదాకా.

"పెద్దకులం మనిషి కదా! కులం తక్కువ కోడల్ని తన ఇంట్లో ఉంచుకోటం ఇష్టం లేక మన్ని దూరంగా, విడిగా ఉంచుతున్నాడు" వ్యాఖ్యానించాడు కిరణ్ తండ్రి మాటల్ని.

"నన్నూరటపర్చటానికి ఆ పెద్ద మనసుకు మోటివ్స్ అంటగట్టాల్సిన పనిలేదు."

"మరి మేం వెళ్తాంబాబూ! వీలుచూసుకుని ఓసారి అటురండి. మా వాళ్ళందరూ పిల్ల పెళ్ళిభోజనం ఎప్పుడు పెడ్తావని అడుగుతున్నారు. త్వరలోనే ఆ ఏర్పాటుచూస్తాం, మీకెప్పుడు వీలవుతుందో చెప్తే" అంది సుమిత్ర.

"రేపు మేం వేరే ఇంటికి మారిపోతున్నాం. మీరూ, మామయ్యగారూ ముందుగా మా ఇంటికి రావాలి. బిందుకు కాస్తంత సాయంచేసినట్టూ ఉంటుంది మీరొస్తే."

"నువ్వు పిలవాలిగానీ, ఎందుకు రామయ్యా! వస్తాం. కొత్తకాపురం కదా, సామాన్లవీ కొన్నాను. రేపు ఫోను చేసి అడ్రసు చెప్పు. పంపిస్తాను" అన్నాడు శ్రీరామమూర్తి.

వాళ్ళు వెళ్ళిపోయాక అంది బిందు. "మా వాళ్ళని రమ్మని పిల్చావు. మామయ్యనీ, అత్తయ్యనీ, నిర్మలను కూడా రమ్మని పిలువు."

"వాళ్ళొద్దులే, వచ్చినప్పటినుండి అమ్మ ఏదో ఒకటి సాధిస్తూ ఉంటుంది."

"ఆమెతో ఎలా నెగ్గుకు రావాలో నాకు తెలుసు. నువ్వేం కించపడక" అంటూ అటుగా వెళ్తున్న కేశవమూర్తిని "మామయ్యా" అని పిల్చి, ఆయన దగ్గరకు రాగానే "ఎల్లుండి మీరంతా మా ఇంటికి భోజనానికి రావాలి. మా కొత్త కాపురానికి మీలాంటి పెద్దల ఆశీర్వాదం అవసరం" అంది బిందు.

ఆయన స్నేహపిచ్ఛలంగా నవ్వాడు!

"అలాగే నమ్మా, నువ్విలాపిలవటం నాకెంతో ఆనందంగా ఉంది. మేమంతా వస్తాం"

★ ★ ★

మర్నాడు పొద్దున నూతన దంపతుల్ని వాళ్ళ ఇంటికి ప్రయాణంకడ్తూ, "మీరిద్దరూ ముందుగా పదండి, అక్కడికి తీసుకు రావాల్సిన సామాన్లున్నాయి. అవి తీసుకుని మేమంతా వస్తాం" అని చెప్పాడు కేశవమూర్తి.

శివరావు భార్య రేవతి కొత్త దంపతులకు హారతి ఇచ్చి గృహప్రవేశం చేయించింది.

"కూర్చోండి. కాఫీ తీసుకువస్తాను" అంటూ కిందకు దిగిపోయింది.

బిందు కిరణ్ వైపు తిరిగి అంది "మనం కొత్తకాపురం ప్రారంభించకముందే నీకో మాట చెప్పాలి, కిరణ్! నన్ను వటవృక్షానికి అల్లుకున్న తీగను చూసినట్టు చూడకు, పరిరక్షించాలని ప్రయత్నించకు. ఇప్పటిదాకా నువ్వా ప్రయత్నమే చేశావు. అలాగే నువ్వే తీగై నేననే వటవృక్షానికి పాకాలని ప్రయత్నించకు. భార్యాభర్తలు సమానస్కంధులు. ఒకరికి ఒకరు తోడునీడగా బతుకుదాం. నాకోసం నువ్వే త్యాగాలూ చేయనక్కరలేదు. నేను నీ జీవితంలోకి రాకముందే నీకున్న బంధాలను ఇప్పుడు నువ్వు తెంపేసుకోవాల్సిన అవసరమూ లేదు. ఆ బంధాలూ, ఆ పరిసరాలూ నిన్నిప్పటి కిరణ్‌గా చేశాయి. వాటిని తెంపేసుకున్న నువ్వు నువ్వుగా ఉండవు, అలాంటి నీపట్ల నాకు గౌరవమూ ఉండదు. నన్ను సంతోషపెట్టటానికి నీ వాళ్ళను కించపరుస్తున్నావు. ఇది ప్రమాదకర లక్షణం. రేపు పొద్దున నీకు పాకాలనిపించే మరో వృక్షం దొరికితే, దాన్ని చుట్టుకో ప్రయత్నిస్తూ,

ఇప్పటిదాకా నువ్వు మీ వాళ్ళ మీద ప్రదర్శించిన కోపతాపాలన్నీ నా మీద ప్రదర్శిస్తావు. మన బంధం తెంచడానికి ప్రయత్నిస్తావు. బంధాలుండాలి. అప్పుడే మనిషి సమాజారోగ్యానికి తగినట్టు ఎదుగుతాడు. తెంచుకుంటే సమాజానికి హాని కలిగిస్తాడు. మానవ సంబంధాన్ని స్నేహంతో మరింత పటిష్ఠం చేసుకోవాలి తప్ప తెంచుకోకూడదు."

ఆమె మాటలు వింటూ అవాక్కై నిలబడిపోయాడు కిరణ్. మరుక్షణంలోనే నవ్వి "సరే" అన్నాడు.

సందేహంగా అతని వంక చూసింది బిందు.

'ఆంధ్రభూమి' (ప్రియదర్శిని) 1 జులై 2000